క్లుప్తంగా

హెల్మెట్ ధారణతో సురక్షిత ప్రయాణం


గురుద్వారా జంక్షన్‌లో ప్లకార్డుల ద్వారా అవగాహన కల్పిస్తున్న ట్రాఫిక్ పోలీసులు

సీతమ్మధార: ద్విచక్ర వాహన చోదకులు హెల్మెట్ తప్పనిసరిగా ధరించి సురక్షితంగా ప్రయాణించాలని ద్వారకా జోన్ ట్రాఫిక్ ఎస్ఐ రామ్మూర్తి సూచించారు. గురుద్వారా జంక్షన్‌లో శనివారం ప్లకార్డులు ప్రదర్శిస్తూ హెల్మెట్ ధారణపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2022లో హెల్మెట్ ధరించక సుమారు 147 మంది మృతి చెందారన్నారు. ప్రతి ఒక్క ద్విచక్ర వాహనదారుడు హెల్మెట్ ధరించాలని కోరారు. కార్యక్రమంలో ట్రాఫిక్ సిబ్బంది రామకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పాలిసెట్ మోడల్ పరీక్ష రేపు

మురళీనగర్: సాంకేతిక విద్యా శాఖ ఆధ్వర్యంలో కంచరపాలెం ప్రభుత్వ కెమికల్ ఇంజినీరింగ్ కాలేజీలో పాలిసెట్ ఉచిత శిక్షణ పొందిన విద్యార్థులకు సోమవారం పాలిసెట్ మోడల్ పరీక్ష నిర్వహించనున్నట్లు గెస్ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.వెంకటరమణ తెలిపారు. ఇక్కడ శిక్షణ పొందిన రెండు బ్యాచీల విద్యార్థులకు ఆరోజు ఉదయం 9.30 నుంచి 11.30 గంటల వరకు పరీక్ష జరుగుతుందని, విద్యార్థులందరూ తప్పనిసరిగా హాజరు కావాలని ఆయన సూచించారు.

కలియుగ వెంకన్నకు పూజలు

కంచరపాలెం: తిక్కవానిపాలెం కలియుగ వేంకటేశ్వర స్వామి ఆలయంలో శనివారం విశేష పూజలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు చామర్తి శంకర్‌శర్మ, జగన్నాథశర్మ ఆధ్వర్యంలో ఉదయం సుప్రభాతసేవ, అర్చనలు, పంచామృతాభిషేకాలు చేశారు. గ్రామాధ్యక్షుడు ఉమ్మిడి వాసుదేవరావు, కార్యదర్శి రాజు నేతృత్వంలో ఆలయ కమిటీ సభ్యులు భక్తులకు తీర్థప్రసాదాలు అందించారు.

స్కేటింగ్ పోటీల్లో పవన్‌కు రజతం


పవన్ కార్తికేయను అభినందిస్తున్న బుల్లయ్య కళాశాల యాజమాన్యం

సీతంపేట: ఇటీవల చండీగఢ్ మొహాలిలో జరిగిన ఆల్ ఇండియా ఇంటర్ డిస్ట్రిక్ట్ రోలర్ స్కేటింగ్ చాంపియన్‌షిప్ పోటీల్లో డాక్టర్ లంకపల్లి బుల్లయ్య కళాశాల విద్యార్థులు అద్భుత ప్రతిభతో పతకాలు కైవసం చేసుకున్నారు. బీఎస్సీ ఫస్టియర్ విద్యార్థి సిహెచ్.వి.పవన్ కార్తికేయ ఇన్ లైన్ ఆల్పెన్ విభాగంలో రజత పతకం సాధించాడు. ఈ సందర్భంగా శనివారం కళాశాలలో పవన్‌ను బుల్లయ్య కాలేజీ సెక్రటరీ కరస్పాండెంట్ జి.మధుకుమార్‌తో పాటు డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ జి.ఎస్.కె.చక్రవర్తి, వైస్ ప్రిన్సిపాల్ ఆర్.శ్రీకాంత్, అసిస్టెంట్ డీన్ మేజర్ టి.బ్రహ్మానందరెడ్డి, వ్యాయామ విభాగాధిపతి వై.శ్రీనివాసరావు, ఫిజికల్ డైరెక్టర్ బి.ఆర్.ఎస్.లక్ష్మణరెడ్డి అభినందించారు.

'నారాయణ'లో 99 శాతం ఉత్తీర్ణత


టెన్త్ విద్యార్థులతో ఏజీఎం రాజ్‌కుమార్

సీతమ్మధార: పదో తరగతి పరీక్ష ఫలితాల్లో నారాయణ విద్యా సంస్థలు మంచి ఫలితాలు సాధించాయని స్కూల్ ఏజీఎం రాజ్‌కుమార్ తెలిపారు. సీతమ్మధారలోని స్కూల్‌లో శనివారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. సీతమ్మధార బ్రాంచ్‌లో 99 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు చెప్పారు. అధిక మార్కులు సాధించిన విద్యార్థులను రాజ్‌కుమార్ అభినందించారు. కార్యక్రమంలో అకాడమిక్ కో–ఆర్డినేటర్ రామ్‌నరేష్, ప్రతాప్, పవన్, ప్రిన్సిపాల్స్, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

టెన్త్‌లో అదరగొట్టారు..

- ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులు
- సత్తా చాటిన ప్రభుత్వ పాఠశాలలు

పదో తరగతి పరీక్ష ఫలితాల్లో నియోజకవర్గంలోని జీవీఎంసీ ఉన్నత పాఠశాలల విద్యార్థులు అద్భుత ప్రతిభ చూపారు. ఉపాధ్యాయుల కృషి, అధికారుల మార్గదర్శకత్వం ఫలితంగా మంచి మార్కులతో సత్తా చాటారు. ప్రైవేటు స్కూళ్లకు దీటుగా అత్యధిక మార్కులు సాధించి రికార్డు సృష్టించారు. ప్రభుత్వ పాఠశాలలు గతేడాది కన్నా మెరుగైన ఫలితాలు సాధించి ఔరా అనిపించుకున్నాయి.

సీతంపేట: రాష్ట్ర ప్రభుత్వం శనివారం విడుదల చేసిన టెన్త్ పరీక్ష ఫలితాల్లో స్థానిక ప్రభుత్వ పాఠశాలలు మంచి ఉత్తీర్ణత సాధించాయి. సీతంపేట మధురానగర్‌లోని జీవీఎంసీ హైస్కూల్ 78 శాతం ఉత్తీర్ణత సాధించి.. జీవీఎంసీ పాఠశాలల్లో రెండో స్థానంలో నిలిచింది. గతేడాది 74.39 శాతం కాగా.. ఈ ఏడాది మరో 3.61 శాతం అధికంగా సాధించడం విశేషం. 86 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కాగా 67 మంది పాసయ్యారు. ఇందులో 42 మంది ప్రథమ, 16 మంది ద్వితీయ, 9 మంది తృతీయ శ్రేణిల్లో ఉత్తీర్ణులయ్యారు. ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను స్కూల్ హెచ్‌ఎం శాంతికుమారి అభినందించారు.

ఎన్జీజీవోస్ కాలనీ హైస్కూల్ ఉత్తీర్ణత 58.89 శాతం

అక్కయ్యపాలెం ఎన్జీజీవోస్ కాలనీ జీవీఎంసీ హైస్కూల్ టెన్త్ విద్యార్థులు 58.89 శాతం ఉత్తీర్ణత సాధించారు. గతేడాది 63.49 శాతం కంటే ఈ ఏడాది 4.60 శాతం ఉత్తీర్ణత తగ్గింది. మొత్తం 90 మంది పరీక్షలకు హాజరు కాగా.. 53 మంది పాసయ్యారు. 30 మంది ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణులయ్యారు.

జ్ఞాననికేతన్ హైస్కూల్: 98 శాతం

అక్కయ్యపాలెం జ్ఞాననికేతన్ ఎయిడెడ్ హైస్కూల్ 98 శాతం ఉత్తీర్ణత సాధించింది. 162 మంది పరీక్షలకు హాజరు కాగా.. 157 మంది ఉత్తీర్ణులయ్యారు.

ఎస్‌ఎంసీహెచ్ స్కూల్: 59.50 శాతం

సీతమ్మధార: పీ అండ్ టీ కాలనీలోని జీవీఎంసీ ఎస్ఎంసీహెచ్ స్కూల్ 59.50 శాతం ఉత్తీర్ణత సాధించింది. 115 మంది బాలికలు, 75 మంది బాలురు పరీక్షలు రాశారు. 63 మంది ఫస్ట్, 32 మంది సెకండ్, 18 మంది థర్డ్ క్లాస్‌లో ఉత్తీర్ణులయ్యారని, 77 మంది ఫెయిలయ్యారని హైస్కూల్ హెచ్‌ఎం రాం ప్రసాద్ తెలిపారు. పాసైన విద్యార్థులందరికీ హెచ్‌ఎం అభినందనలు తెలిపారు.

కప్పరాడ హైస్కూల్: 78.64 శాతం

కంచరపాలెం: కప్పరాడ జీవీఎంసీ హైస్కూల్ 78.64 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు హెచ్‌ఎం విజయమాలిని తెలిపారు. 103 మంది టెన్త్ విద్యార్థులు పరీక్షలు రాయగా 81 మంది ఉత్తీర్ణత సాధించారు.

ఆర్పీ పేట హైస్కూల్: 54.05 శాతం

రామ్మూర్తిపంతులుపేట జీవీఎంసీ హైస్కూల్ 54.05 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు హెచ్‌ఎం ఆర్.శ్రీనివాసరావు తెలిపారు. 143 మంది విద్యార్థులు టెన్త్ పరీక్షలకు హాజరు కాగా.. 77 మంది పాసయ్యారన్నారు. వారిని హెచ్‌ఎం ఉపాధ్యాయ సిబ్బంది, పేరేంట్ కమిటీ సభ్యులు అభినందించారు.

కేఎస్‌ఎం గర్ల్స్ హైస్కూల్: 74 శాతం

తాటిచెట్లపాలెం: జీవీఎంసీ 42వ వార్డు రైల్వే న్యూకాలనీలోని కేఎస్‌ఎం గర్ల్స్‌హైస్కూల్ 74 శాతం ఉత్తీర్ణత సాధించింది. మొత్తం 74 మంది విద్యార్థినులు టెన్త్ పరీక్షలకు హాజరవగా.. 55 మంది ఉత్తీర్ణులయ్యారు. ఉత్తీర్ణులందరికీ పాఠశాల హెచ్‌ఎం రాము శుభాకాంక్షలు తెలియజేశారు.

రైల్వే న్యూకాలనీ స్కూల్: 70.27 శాతం

రైల్వే న్యూకాలనీ జీవీఎంసీ హైస్కూల్ 70.27 శాతం ఉత్తీర్ణత సాధించింది. మొత్తం 37 మంది విద్యార్థులు టెన్త్ పరీక్షలు రాయగా.. 26 మంది పాసయ్యారు. ఉత్తీర్ణులను స్కూల్ హెచ్‌ఎం సన్యాసిరావు అభినందించారు.

మాధవధార హైస్కూల్: 65 శాతం

మురళీనగర్: మాధవధార జీవీఎంసీ హైస్కూల్ 65 శాతం ఉత్తీర్ణత సాధించింది. గతేడాది 59 శాతం కంటే అధికంగా ఫలితాలు వచ్చాయి. ఈ పాఠశాల నుంచి 146 మంది పరీక్షలు రాయగా.. 94 మంది పాసయ్యారు. ఇంగ్లిష్ మీడియం 69 శాతం, తెలుగు మీడియం 47 శాతం ఉత్తీర్ణులయ్యారు.


మాధవధార జీవీఎంసీ హైస్కూల్ టాపర్ ధనలక్ష్మికి స్వీట్ తినిపిస్తున్న తల్లి చిన్నలక్ష్మి

కె.కాలనీ హైస్కూల్: 67 శాతం

కె.కాలనీ జీవీఎంసీ హైస్కూల్ 67 శాతం ఉత్తీర్ణత సాధించింది. 109 మంది పరీక్షలకు హాజరు కాగా.. 74 మంది పాసయ్యారు. గతేడాది కన్నా 15 శాతం అత్యధిక ఫలితాలు సాధించారు.

ప్రణాళికతో చదివా..



ఉపాధ్యాయుల సలహాలను పాటిస్తూ ప్రణాళికతో చదవడం వల్ల టెన్త్ ఫలితాల్లో మంచి మార్కులు సాధించాను. నాన్న బి.చిన్నరాజు కార్మికుడు, అమ్మ చిన్నలక్ష్మి రజక వృత్తి చేస్తోంది. తెన్నేటినగర్‌లో అద్దె ఇంట్లో ఉంటున్నాం. అక్క తులసి డిప్లొమా సాంకేతిక పాలిటెక్నిక్‌లో ఎలక్ట్రికల్ థర్డ్ ఇయర్ చదువుతోంది. పదో తరగతి ప్రారంభం నుంచి ప్రతి రోజూ చెప్పిన పాఠాలను ఇంటికి వచ్చి రాత్రి పది గంటల వరకు పునశ్చరణ చేసుకునేదాన్ని. టెక్స్ట్ బుక్స్ రీడింగ్ ఎక్కువగా చేసేదాన్ని. ఉపాధ్యాయులు ఇచ్చిన మెటీరియల్ బాగా ఉపయోగపడింది. హెచ్‌ఎం బి.హేమలత, ఉపాధ్యాయుల ప్రత్యేక పర్యవేక్షణలో నిర్వహించిన స్పెషల్ క్లాసులు ఉపయోగపడ్డాయి. మ్యాథ్స్ అంటే ఇష్టం. ట్రిపుల్ ఐటీ వస్తే జాయిన్ అవుతాను.

– బోదకుర్తి ధనలక్ష్మి,
మాధవధార జీవీఎంసీ హైస్కూల్

సాధనతో సాధించా..



ఉపాధ్యాయులు బోధించిన పాఠాలకు సంబంధించిన అంశాలను ఎక్కువగా సాధన చేయడం వల్ల మంచి మార్కులు సాధించాను. నాన్న తవిటిరాజు పండ్ల వ్యాపారం చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నారు. అమ్మ గౌరీ గృహిణి. అక్క సాయిలీల గాయత్రి కాలేజీలో బీటెక్ ఐటీ సెకెండియర్ చదువుతోంది. కైలాసపురంలోని అద్దె ఇంట్లో ఉంటున్నాం. టెక్స్ట్ బుక్స్‌పై ఆధారపడేవాడిని. టాపిక్‌ను బాగా అవగాహన చేసుకునేవాడిని. ఎటువంటి ప్రశ్నలు ఇచ్చినా రాయగలిగేలా సాధన చేశాను. ఉపాధ్యాయులు మాకు నిత్యం సలహాలు ఇచ్చేవారు. ఇంట్లో పనులు చెప్పకుండా తల్లిదండ్రులు నాకు చదువుకోవడానికి ఎక్కువ అవకాశం ఇచ్చారు. నాకు సైన్స్, మ్యాథ్స్ అంటే బాగా ఇష్టం. నేవల్ డిఫెన్స్ అకాడమీలో ఉద్యోగం సాధిస్తా.

– గుండాల అనంత్‌కుమార్,
మాధవధార జీవీఎంసీ హైస్కూల్

ఇంటింటా విశేష స్పందన


51వ వార్డులో సంక్షేమ పథకాల కరపత్రం అందిస్తున్న కె.కె.రాజు, రెయ్యి వెంకటరమణ

మద్రిపాలెం: జీవీఎంసీ 51వ వార్డులో శనివారం నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమానికి విశేష స్పందన లభించింది. 291 సచివాలయం పరిధి మాధవధార, కళింగనగర్ వుడా క్వార్టర్స్ ప్రాంతాల్లో కార్పొరేటర్ రెయ్యి వెంకటరమణతో కలిసి నెడ్‌క్యాప్ చైర్మన్, వైఎస్సార్‌సీపీ ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త కె.కె.రాజు ప్రతి గడపకు వెళ్లారు. ఇప్పటివరకు ప్రభుత్వం అందిస్తున్న, చేపట్టిన సంక్షేమ పథకాల లబ్ధిని వివరిస్తూ ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కె.కె.రాజు మాట్లాడుతూ గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ప్రతి ఇంటికి వెళ్తుంటే ప్రజల నుంచి విశేష స్పందన, ఆదరణ లభిస్తోందన్నారు. కార్యక్రమంలో 50వ వార్డు కార్పొరేటర్ వావిలపల్లి ప్రసాద్, డైరెక్టర్ పైడి శ్రీను, దిడ్డి రమేష్, రాయుడు శ్రీను, నూకరాజు, తిరుమలరావు, పైడి ప్రతాప్, రత్నం, మెట్ట దమయంతి, వై.వరలక్ష్మి, రాణి, శ్యామ్, గణేష్, రాజేశ్వరరావు, ఎం.శ్రీను, రామ్మోహన్‌రావు, ఎం.సునీల్, సీనియర్ నాయకులు పి.సునీత, షేక్ బాబ్జి, చిన్న, సీపాన రాము, గురువోజీ, అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

మహిళా వాకర్స్ సేవలు ఆదర్శం


కళాకారులను సత్కరిస్తున్న డాక్టర్ రవీంద్ర, మహిళా వాకర్స్ క్లబ్ ప్రతినిధులు

మురళీనగర్: మహిళా సాధికారతకు మహిళా వాకర్స్ క్లబ్ సభ్యులు తార్కాణంగా నిలుస్తున్నారని వాకర్స్ ఇంటర్నేషనల్ అధ్యక్షుడు డాక్టర్ ఎస్పీ రవీంద్ర అన్నారు. మురళీనగర్ వాకర్స్ పార్కులో శనివారం మహిళా వాకర్స్ క్లబ్ 17వ వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరోగ్యానికి నడక ప్రాధాన్యంపై ప్రజలను చైతన్యం చేయడంలో మహిళా వాకర్స్ క్లబ్ సభ్యులు విశేషమైన కృషి చేస్తున్నారన్నారు. వీరు నిర్వహిస్తున్న సామాజిక సేవా కార్యక్రమాలు ఆదర్శంగా నిలుస్తున్నాయని పేర్కొన్నారు. క్లబ్ అధ్యక్షురాలు ఎం.శేషామణి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో మహిళలు తాము చేస్తున్న సేవలను, క్లబ్ కార్యదర్శి ఎస్.పుష్పలత క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సేవా కార్యక్రమాలను వివరించారు. ఈ సందర్భంగా షరీఫ్ అనే వ్యక్తికి హియరింగ్ మెషిన్ కోసం రూ.10,000 ఆర్థిక సాయం అందించారు. ఉపాధ్యక్షురాలు సిహెచ్.వరలక్ష్మి, పల్లా అరుణ మహాత్మా గాంధీ ఫెలోషిప్ తీసుకున్నారు. సుస్వర అకాడమీ(హైదరాబాద్) హరి మంగళంపల్లి కుమార్తెలు ప్రదర్శించిన భరతనాట్యం ఆహూతులను అలరించింది. కళాకారులను వాకర్స్ క్లబ్ ప్రతినిధులు సత్కరించారు. కార్యక్రమంలో జిల్లా 101 గవర్నర్ ఉప్పలపాటి శుభ, సెక్రటరీ కె.ద్వారకానాథ్, ఆర్సీ–5 లక్ష్మీరెడ్డి, వాకర్స్ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు పల్లా చంద్రమౌళి, ఎల్‌వీ సుధాకర్, క్లబ్ కోశాధికారి లక్ష్మి, పూర్వ అధ్యక్షురాలు కె.మాధవి, ఎస్.లలితారెడ్డి, ఇతర కార్యవర్గ సభ్యులు, వివిధ వాకర్స్ క్లబ్‌ల ప్రతినిధులు, వాకర్స్ ఇంటర్నేషనల్ ప్రతినిధులు పాల్గొన్నారు.

వినియోగదారుల రక్షణ చట్టంపై శిక్షణ తరగతులు


విద్యార్థినులకు అవగాహన కల్పిస్తున్న వినియోగదారుల సంఘ చైర్మన్ సత్యనారాయణ

కంచరపాలెం: ఐటీఐ జంక్షన్‌లోని జిల్లా వినియోగదారుల సంఘం సమైక్య కార్యాలయంలో సంఘ చైర్మన్ మద్రి సత్యనారాయణ ఆధ్వర్యంలో శనివారం వినియోగదారుల రక్షణ చట్టంపై ఇంటర్న్‌షిప్ శిక్షణ తరగతులు నిర్వహించారు. జ్ఞానాపురం సెయింట్ జోసెఫ్ మహిళా కళాశాల విద్యార్థినులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సత్యనారాయణ మాట్లాడుతూ సమాజంలో వినియోగదారులు ఎలా మోసపోతున్నారో తెలుసుకోడానికి కొన్ని సంస్థలను ఎంపిక చేసి సర్వే రిపోర్ట్ ప్రభుత్వానికి తెలియజేయాలన్నారు. కోర్టు అంటే భయపడే వారు, చదువురాని వారికి వినియోగదారుల సంఘం ఎంతగానో సేవలందిస్తుందని చెప్పారు. విద్యార్థి దశ నుంచే వినియోగదారుల రక్షణ చట్టంపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని సూచించారు.

రేపటి నుంచి వేసవి విజ్ఞాన శిబిరం


కరపత్రం ఆవిష్కరిస్తున్న కార్పొరేటర్ ప్రసాద్

మద్రిపాలెం: రాష్ట్ర పౌర గ్రంథాలయ శాఖ ఆధ్వర్యంలో ఈ నెల 8 నుంచి జూన్ 11 వరకు వేసవి విజ్ఞాన శిబిరం నిర్వహిస్తున్నట్లు 50వ వార్డు కార్పొరేటర్ వావిలపల్లి ప్రసాద్ తెలిపారు. విశాఖ జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ కొండా రమాదేవి, కార్యదర్శి ఆర్‌సిహెచ్ వెంకటరావుల సూచనల మేరకు శనివారం వార్డు కార్యాలయంలో ఆయన కరపత్రాలను ఆవిష్కరించి మాట్లాడారు. ఈ సమ్మర్ క్యాంప్‌లో కథలు, కథనాలు, సృజనాత్మక కృత్యాలు, పుస్తక పఠనం, చిత్రలేఖనం, పేపర్ ఆర్ట్, థియేటర్ ఆర్ట్ వంటి కార్యక్రమాలు ప్రతి రోజూ ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు జరుగుతాయన్నారు. విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మురళీనగర్ శాఖ గ్రంథాలయ అధికారి పద్మజ, మెంబర్ జామి అన్నాజీరావు తదితరులు పాల్గొన్నారు.

పాలిటెక్నిక్ విద్యార్థులకు ప్రత్యేక క్యాంపస్ డ్రైవ్


పరీక్ష రాస్తున్న పాలిటెక్నిక్ విద్యార్థులు

మురళీనగర్: కంచరపాలెం ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీలో కేంద్రీకృత ప్రాంగణ ఉద్యోగ నియామకాలకు శనివారం ప్రత్యేక క్యాంపస్ డ్రైవ్ జరిగింది. ఆంధ్రప్రదేశ్ సాంకేతిక విద్యా శాఖ కమిషనర్ సి.నాగరాణి ఆదేశాల మేరకు మేధా సర్వో డ్రైవ్స్ ప్రైవేట్ లిమిటెడ్(హైదరాబాద్) విద్యార్థులకు రాత, మౌఖిక పరీక్షలు నిర్వహించింది. విశాఖపట్నం, భీమునిపట్నం, పెందుర్తి, చోడవరం, అనకాపల్లి, నర్సీపట్నం, పాడేరు ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలల నుంచి 305 మంది విద్యార్థులు హాజరయ్యారు. కంచరపాలెం ప్రభుత్వ పాలిటెక్నిక్ నుంచి 44 మంది మెకానికల్, 33 మంది ఎలక్ట్రికల్, భీమునిపట్నం ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ నుంచి 22 మంది ఎలక్ట్రానిక్, పెందుర్తి నుంచి 20 మంది మెకానికల్, 29 మంది ఎలక్ట్రికల్, 28 మంది ఎలక్ట్రానిక్స్, చోడవరం నుంచి 47 మంది ఈసీఈ, నర్సీపట్నం నుంచి 30 మెకానికల్, 9 ఈసీఈ, పాడేరు ప్రభుత్వ ఆదర్శ ఆశ్రమ పాలిటెక్నిక్ నుంచి 11 మెకానికల్, ముగ్గురు ఎలక్ట్రికల్ విద్యార్థులు పరీక్ష రాశారు. కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ కె.డి.వి.నరసింహారావు, ట్రైనింగ్ అండ్ ప్లేస్‌మెంట్ ఆఫీసర్ ఎం.హరిబాబు పర్యవేక్షించారు.

ముగిసిన ఉచిత శిక్షణ


విద్యార్థులకు సూచనలిస్తున్న అధ్యాపకుడు

మురళీనగర్: కంచరపాలెం ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీలో గత నెల 17న ప్రారంభమైన పాలిసెట్ ఉచిత శిక్షణ కార్యక్రమం శనివారంతో ముగిసింది. గణితం, ఫిజిక్స్, కెమిస్ట్రీ సబ్జెక్టులకు ప్రత్యేకంగా లెక్చరర్లను కేటాయించి శిక్షణ ఇచ్చారు. ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ కేడీవీ నరసింహారావు, జనరల్ హెడ్ డాక్టర్ పీఎం బాషా పర్యవేక్షణలో జరిగిన ఈ శిక్షణలో భాగంగా గ్రాండ్ టెస్ట్ నిర్వహించారు. విద్యార్థులకు ఉచితంగా మెటీరియల్ అందించారు. పరీక్ష రాసేటప్పుడు పాటించాల్సిన విధానాన్ని అధ్యాపకులు వివరించారు. 120 మంది విద్యార్థులు పాల్గొన్నారు.

వైభవుడికి సుప్రభాత సేవ

మురళీనగర్: కప్పరాడ ఎన్‌జీజీవోస్ కాలనీలో వెలసిన వైభవ వేంకటేశ్వర స్వామికి శనివారం సుప్రభాత సేవ ఘనంగా నిర్వహించారు. తెల్లవారుజామున గొల్ల సన్నిధి చేసి సుప్రభాతం చదివి వినిపించారు. అనంతరం స్వామికి అభిషేకాలు చేశారు. ఉదయం 7.30 గంటలకు బాలభోగం, 9.30 గంటలకు భక్తుల సమక్షంలో శ్రీవారికి అర్చన, మంగళాశాసనం, తీర్థప్రసాద గోష్ఠి, 10 గంటలకు సామూహిక విష్ణు సహస్రనామార్చన, 11.30 గంటలకు రాజభోగ నివేదన చేశారు. సాయంత్రం 5.30 గంటలకు ఆకాశ దీపారాధన, 7 గంటలకు విశేష హారతి సమర్పణలో భాగంగా నక్షత్ర, కర్పూర, కూష్మాండ, కుంభ హారతులు సమర్పించారు. భక్తులు అత్యధిక సంఖ్యలో తరలివచ్చి వైభవుడిని దర్శించుకున్నారు. ఆలయ నిర్వాహకులు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

అలరించిన సంగీత విభావరి

సీతంపేట: వి.రామకృష్ణ మెమోరియల్ సాంస్కృతిక సంస్థ ఆధ్వర్యంలో శనివారం ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో నిర్వహించిన సినీ సంగీత విభావరి ఆద్యంతం ప్రేక్షకులను అలరించింది. నటరత్న ఎన్టీఆర్ శత జయంతి సందర్భంగా జూనియర్ రామకృష్ణ సారథ్యంలో గాయనీ గాయకులు పలు హిట్ చిత్రాల్లోని పాటలు పాడి వీనుల విందు చేశారు. జి.రామకృష్ణ, సీవీ రాజేశ్వరి పాడిన మధు వలక బోసే.. మహమ్మద్ ఖాన్, గీత పాడిన హల్లో నేరేడు కళ్లు.. రాము, ఎస్.రాజేశ్వరి పాడిన ఈ దేవీ ఏమి సొగసులు నీది.. మెలోడి సత్యనారాయణ, నీహారిక పాడిన నీవేగా నా ప్రాణం.. లక్ష్మీనారాయణ, సీవీఆర్ పాడిన మోగింది కల్యాణ వీణ.. ఎస్ఎస్ఎన్ రాజు, నీహారిక పాడిన నన్ను దోచుకుందువటే పాటలు ఎంతగానో అలరించాయి. కళా సంస్థల ప్రతినిధులు కొణతాల రాజు, చెన్నా తిరుమలరావు, సన్‌మూర్తి, ఎం.వి.రాజశేఖర్ పాల్గొన్నారు.

రూ.17 లక్షలతో అభివృద్ధి పనులు


పనులు ప్రారంభిస్తున్న బానాల శ్రీనివాసరావు

సీతంపేట: జీవీఎంసీ 44వ వార్డు ముస్లిం తాటిచెట్లపాలెం 239 సచివాలయం పరిధిలో సుమారు రూ.17 లక్షలతో సీసీ రోడ్లు, డ్రెయిన్లు నిర్మించనున్నారు. పనులు ఈ పనులను ముఖ్య అతిథి జీవీఎంసీ ఫ్లోర్ లీడర్, కార్పొరేటర్ బానాల శ్రీనివాసరావు శంకుస్థాపన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వార్డులో ఇప్పటివరకు పలు ప్రాంతాల్లో సీసీ రోడ్లు, డ్రెయిన్లు నిర్మించామన్నారు. వార్డులో మౌలిక వసతుల విషయంలో ఏమైనా సమస్యలున్నట్టయితే తన దృష్టికి తీసుకొస్తే పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఏఈ రమణమ్మ, సచివాలయ అడ్మిన్ శివకృష్ణ, మసీదు సంఘం ప్రెసిడెంట్ హబీబ్, కన్వీనర్లు హీరా, ముస్తఫా, గోపి, బేగం పాల్గొన్నారు.

వ్యక్తిత్వ వికాసంపై అవగాహన


విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న నాయుడు

మురళీనగర్: కంచరపాలెం ప్రభుత్వ కెమికల్ ఇంజినీరింగ్ కాలేజీలో పాలిసెట్ ఉచిత శిక్షణ పొందుతున్న విద్యార్థులకు శనివారం వ్యక్తిత్వ వికాస తరగతులు నిర్వహించారు. ఎస్ఎల్‌పీ మాస్టర్ ప్రాక్టీషనర్ ఎస్‌వీఆర్ నాయుడు ఒత్తిడి జయించడంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. పోటీ పరీక్షలకు సమాయత్తమయ్యేటప్పుడు అనుసరించాల్సిన విధానాలను వివరించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ కె.వెంకటరమణ అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో కెమికల్ ఇంజినీరింగ్ హెడ్ డాక్టర్ బీవీ లక్ష్మణరావు పాల్గొన్నారు.

కొండవాలులో నేలకొరిగిన విద్యుత్ స్తంభం


శ్రీనివాసనగర్‌లో విద్యుత్ స్తంభం ఏర్పాటును పరిశీలిస్తున్న ఏఈ సురేష్ తదితరులు

కంచరపాలెం: జీవీఎంసీ 48వ వార్డు శ్రీనివాసనగర్ కొండవాలు ప్రాంతంలో శనివారం ఉదయం విద్యుత్ స్తంభం ఒక్కసారిగా కుప్పకూలి సమీప భవనాలపై పడింది. ఆ సమయంలో అటుగా ఎవరూ లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. కార్పొరేటర్ గంకల కవిత ప్రమాద స్థలానికి చేరుకుని కంచరపాలెం జోన్–2 ఏపీఈపీడీసీఎల్ అధికారులకు ఫోన్‌లో ఫిర్యాదు చేశారు. ఎలక్ట్రికల్ ఏఈ సురేష్ సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకుని విద్యుత్ తీగలు, నేలకొరిగిన స్తంభాన్ని తొలగించారు. యుద్ధప్రాతిదికక కొత్త సిమెంట్ స్తంభాన్ని ఏర్పాటు చేసిన విద్యుత్‌ను పునరుద్ధరించారు. బీజేపీ వార్డు అధ్యక్షుడు గంకల అప్పారావు, వార్డు నాయకులు, విద్యుత్ సిబ్బంది పాల్గొన్నారు.

వార్డు సమస్యల పరిష్కారానికి కృషి


48వ వార్డు సమస్యలు తెలుసుకుంటున్న కె.కె.రాజు, జెడ్సీ కృష్ణ

కంచరపాలెం: జీవీఎంసీ 48వ వార్డు కంచరపాలెం న్యూ శ్రీనివాస్‌నగర్‌లో శనివారం నెడ్‌క్యాప్ చైర్మన్, వైఎస్సార్‌సీపీ ఉత్తర సమన్వయకర్త కె.కె.రాజు, జోన్–5 కమిషనర్ ఆర్.జి.వి.కృష్ణతో కలిసి వార్డు సమస్యలపై సమావేశం నిర్వహించారు. స్థానిక కమ్యూనిటీ హాల్‌పై మరో అంతస్తు నిర్మించాలని, పల్నాటి కాలనీలో రోడ్లు, డ్రైనేజీలు నిర్మించాలని, మొదలగు సమస్యలపై స్థానికులు వినతిపత్రాలు అందించారు. సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్యలకు పరిష్కారం చూపిస్తామని కె.కె.రాజు హామీ ఇచ్చారు. అనంతరం నిర్మాణ పనులకు నిధులు మంజూరు చేయాలని జెడ్సీ కృష్ణను ఆయన కోరారు. కార్యక్రమంలో జీవీఎంసీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ అల్లు శంకరరావు, ఏఈ అర్చన, పార్టీ వార్డు సీనియర్ నాయకుడు కర్రి రమారెడ్డి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బీజేపీ పాలనలో కార్మిక చట్టాలు నిర్వీర్యం

- అఖిల భారత సీఐటీయూ ప్రధాన కార్యదర్శి తపన్‌సేన్
- ఉక్కు రిలే దీక్షకు సంఘీభావం

కూర్మన్నపాలెం: శ్రామికుల కష్టనష్టాలను పట్టించుకోకుండా కార్పొరేట్ కంపెనీల యజమానులకు కొమ్ము కాస్తూ, బీజేపీ ప్రభుత్వం కార్మిక చట్టాలను నిర్వీర్యం చేస్తోందని అఖిల భారత సీఐటీయూ ప్రధాన కార్యదర్శి తపన్‌సేన్ విమర్శించారు. స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలోని స్టీల్‌ప్లాంట్ ఆర్చి వద్ద నిర్వహిస్తున్న రిలే నిరాహార దీక్షల్లో 814వ రోజు శనివారం కోక్‌ఓవెన్ విభాగ కార్మికులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా తపన్‌సేన్ మాట్లాడుతూ విభజన హామీలను విస్మరించి రాష్ట్రాన్ని అన్ని విధాల నష్టాల్లోకి నెట్టిన కేంద్రప్రభుత్వం వైఖరి మార్చుకోవాలన్నారు. ప్రైవేట్ కంపెనీలు అప్పులు చేసి తిరిగి కట్టకుండా ఎగ్గొడితే వాటిని రుణమాఫీ పేరుతో మాఫీ చేస్తున్నారని విమర్శించారు. ప్రాణత్యాగాలతో ఏర్పడిన విశాఖ ఉక్కును ప్రైవేట్‌పరం కానివ్వబోమన్నారు. విశాఖ ఉక్కును ప్రభుత్వరంగంలోనే కొనసాగించేలా ప్రజలను చైతన్యం చేసే విధంగా కార్మికులు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు, ఇతర కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికులకు పనిముట్ల పంపిణీ


సామగ్రి అందిస్తున్న కార్పొరేటర్ కామేశ్వరి

కంచరపాలెం: జీవీఎంసీ 47వ వార్డు కంచరపాలెం రాంజీ ఎస్టేట్ వార్డు శానిటరీ కార్యాలయంలో శనివారం పారిశుధ్య కార్మికులకు కార్పొరేటర్ కంటిపాము కామేశ్వరి పనిముట్లు పంపిణీ చేశారు. ఫోర్ వీల్స్, వీల్ బార్స్, టూ వీల్స్ పనిముట్లు, ఆరోగ్య భద్రత దృష్ట్యా మనిషికి 4 లీటర్ల కొబ్బరినూనె బాటిళ్లు, 12 సబ్బులు అందజేసినట్లు ఆమె తెలిపారు. ఫోర్ వీల్స్, వీల్ బార్స్, టూ వీల్స్ వీల్ బార్స్ సచివాలయానికి ఒక్కొక్కటి చొప్పున వార్డు శానిటరీ ఇన్‌స్పెక్టర్ రమణమూర్తికి అందించారు. వార్డును పరిశుభ్రంగా తీర్చిదిద్దాలని కార్పొరేటర్ కామేశ్వరి సూచించారు. కార్యక్రమంలో సచివాలయ శానిటరీ కార్యదర్శులు లక్ష్మణ్‌రావు, శేఖర్‌బాబు, ఆచారి, వార్డు శానిటరీ సూపర్‌వైజర్ సవరపు జయకుమార్, వెంకటేష్, రాజు తదితరులు పాల్గొన్నారు.